గడపగడపకు చిరుకానుక.

అందోల్ జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)



ప్రజా న్యూస్ అందోల్ మండల్ రిపోర్టర్ మమ్మద్ ఆబిద్ అక్టోబర్ 20
విజయదశమి సందర్భంగా అందోల్ జోగిపేట మున్సిపల్ 15 వ వార్డు లో మా ఆత్మీయ కుటుంబ సభ్యులకు దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేయడానికి ప్రతి గడప గడప కు చిన్న చిరు కానుకాను అందజేస్తూ వారి కుటుంబం లో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ చెడుపై మంచి విజయం సాధించిన రోజు కాబట్టి ఎప్పుడు మంచే గెలుస్తుంది అనే నిజమైన పండుగ మన విజయదశమి పండుగ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి ఇండ్లల్లో భోగభాగ్యాలు సిరిసంపదలు కలగజేయాలనీ కోరుకుంటూ ఆందోల్ జోగిపేట మున్సిపల్ 15వ వార్డు ప్రజలందరికీ పేరు పేరునా దసరా శుభాకాంక్షలు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు తెలిపారు.

సంగారెడ్డిలో అంగరంగ వైభవంగా దసరా మహోత్సవం

- జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు..

- సినీ గాయకులు, ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు



సంగారెడ్డి మండలం అక్టోబర్ 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
దసరా పండుగను పురస్కరించుకుని సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దసరా మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టేడియంలో సాయంత్రం 5 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.సినీ నేపథ్య గాయకులు, ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించనున్నాయి. అనంతరం ఆకాశంలో రంగురంగుల బాణసంచా మెరుపులు, రావణ దహన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దసరా వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

విజయదశమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- రుద్రారం, తకెళ్లపాడు, రావులపెంట గ్రామాల్లో ప్రత్యేక పూజలు

నిర్వహించి గ్రామస్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



మిర్యాలగూడ అక్టోబర్ 20 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్. పి వెంకటయ్య)
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈరోజు మిర్యాలగూడ మండలంలోని రుద్రారం, తకెళ్లపాడు గ్రామాలతో పాటు వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో మిర్యాలగూడ శాసనసభ్యులు లిబత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు...ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు... అనంతరం గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించి, ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు...విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని, ప్రజలందరూ ఐకమత్యంతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు...ఈ కార్యక్రమాల్లో గ్రామస్థులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

నాగలాపురం బజారు వీధిలో గుంతలు..

వర్షపు నీటితో వాహనదారులకు ఇబ్బందులు

రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి



తిరుపతి జిల్లా, అక్టోబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, నాగలాపురం మండలం:
నాగలాపురం బజారు వీధిలో రహదారి గుంతలమయంగా మారడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పరిస్థితి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ రోడ్డు సమస్యకు పరిష్కారం లభించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్. అక్టోబర్.20 ప్రజా న్యూస్ నెట్వర్క్..
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలో భౌరంపేట్ డివిజన్ భౌరంపేట్ గ్రామంలోని భ్రమరాంబిక అమ్మవారి ఆలయం మరియు దుర్గా మాత అమ్మవార్లను దర్శించుకున్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదిపరాశక్తి దుర్గామాత ప్రజలందరికీ ఆయురోరాగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు నాచారం మురళి యాదవ్, పాల్వనూరి విష్ణు వర్ధన్ రెడ్డి, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, బైండ్ల గోపాల్ మరియు నాయకులు, యువకులు, ఆలయ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు...

మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా దసరా వేడుకలు

ప్రజలకు, పార్టీ శ్రేణులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ అక్టోబర్ 20 (ప్రజా న్యూస్ నెట్వర్క్)
మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విజయదశమి (దసరా) వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు... పార్టీ శ్రేణులకు స్వీట్లు తినిపించి పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం, పార్టీ, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కృషి చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు వార్డుల వారీగా సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు.

మిర్యాలగూడకు మరో 1,700 ఇందిరమ్మ ఇళ్లు

దీపావళి నాటికి పట్టణంలోని ప్రతి వార్డుకు 20 నుంచి 25 ఇళ్ల చొప్పున కేటాయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన పేదలను గుర్తించి, సంబంధిత కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్, టౌన్ ప్రెసిడెంట్ సమక్షంలో పారదర్శకంగా ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు..

సాగునీటి వినియోగంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారు సూచించారు. చివరి ఎకరం వరకు సాగునీరు అందేలా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని కోరారు.
అదేవిధంగా వేసవిలో తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపి.వివేకానంద్ జన్మదినం సందర్భంగా రూపొందించిన ప్రత్యేక పాట విడుదల



కుత్బుల్లాపూర్. అక్టోబర్.20 ప్రజా న్యూస్ నెట్వర్క్..
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ఎల్పీ నేత, కే.పి. వివేకానంద్ పుట్టినరోజును పురస్కరించుకుని రూపొందించిన బందోబస్తేలే.. బాడీగార్డులే.. బయలెల్లొచ్చావే వివేకన్నా.. బాధంటే చాలే.. భయమెయ్యాదాయే.. బలమై వస్తావే వివేకన్నా.."అనే ప్రత్యేక పాటను ఈరోజు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విడుదల చేశారు.
భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఈ పాటను రూపొందించడంలో కీలక పాత్ర పోషించగా, నల్గొండ గద్దర్ పాటను ఆలపించారు. బుల్లెట్ లక్ష్మణ్ ఈ పాటకు సాహిత్యం అందించారు.
తెలంగాణ మాస్ యాసలో ఆకట్టుకునే పదాలతో రూపొందిన ఈ పాట, ఎమ్మెల్యే కే.పి. వివేకానంద్ పట్ల అభిమానులు చూపిస్తున్న ఆదరణను, ప్రజలకు అండగా నిలిచే నాయకుడిగా ఆయనపై ఉన్న అభిమానాన్ని ప్రతిబింబించేలా ఉంది.
రేపు జరగనున్న ఎమ్మెల్యే కే.పి. వివేకానంద్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈరోజు పాటను విడుదల చేయడంతో అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ ప్రత్యేక పాట జన్మదిన వేడుకలకు మరింత ఉత్సాహాన్ని, సందడిని తీసుకురానుంది.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు

- ఆయుధాలకు పూజలు.. పోలీస్ వాహనాలకు పూలమాలలు..

- సంప్రదాయబద్ధంగా దసరా సంబరాలు

హుజూర్‌నగర్ పట్టణం, అక్టోబర్ 20, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:
హుజూర్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దసరా వేడుకలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్, హుజూర్‌నగర్ రూరల్ ఎస్ఐ హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయదశమి సందర్భంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే వాహనాలు, రక్షణ ఆయుధాలకు పూలమాలలు వేసి సంప్రదాయబద్ధంగా ఆయుధ పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాలతో పోలీస్ స్టేషన్ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విధి నిర్వహణలో కీలకంగా ఉపయోగించే వాహనాలు, ఆయుధాలకు పూజలు నిర్వహించడం ద్వారా పోలీస్ శాఖ సంప్రదాయాలను కొనసాగించారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఒకరికొకరు విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు సమాజంలో శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చట్టపరిధిలో సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది సంకల్పించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించడం, ప్రజలకు భద్రతాభరోసా కల్పించడం పోలీస్ శాఖ బాధ్యతగా కొనసాగుతుందని పేర్కొన్నారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వం, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. హుజూర్‌నగర్ పట్టణంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకునేలా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పోలీస్ శాఖలో నిర్వహించే ఆయుధ పూజ విధి నిర్వహణలో ఉపయోగించే సాధనాల పట్ల గౌరవాన్ని చాటడంతో పాటు బాధ్యతాయుతమైన సేవలను గుర్తుచేసే సంప్రదాయ కార్యక్రమంగా నిలిచింది. పండుగ సందర్భంగా పోలీస్ సిబ్బందిలో ఉత్సాహం నెలకొనగా, అందరూ కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్, హుజూర్‌నగర్ రూరల్ ఎస్ఐ హనుమాన్ నాయక్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివపేట భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో జమ్మి చెట్టుకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు పూజలు

దసరా పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

సదాశివపేట పట్టణంలోని భ్రమరాంబ ఆలయం వద్ద దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జమ్మి చెట్టు పూజ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. విజయదశమి పర్వదినం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింత గోపాల్ శంకర్, అశోక్ గౌడ్, గంటా శివయ్య, జనార్దన్, పృథ్వీరాజ్, దయానంద్, బస్వరాజ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి రూపంలో చిన్నారులు..

- భక్తులను కట్టిపడేస్తున్న దుర్గామాత అవతారాలు

- సీతారాంనగర్ రామాలయంలో చిన్నారుల ప్రత్యేక వేషధారణలు

- అమ్మవారి అలంకరణలో ఆకట్టుకుంటున్న బాలికలు.. నవరాత్రుల్లో ప్రత్యేక ఆకర్షణ

హుజూర్‌నగర్ పట్టణం, అక్టోబర్ 20, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:

హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ రామాలయం ఆవరణలో దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద చిన్నారులు అమ్మవారి రూపాల్లో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. సంప్రదాయ చీరకట్టు, బంగారు కిరీటాలు, వివిధ రకాల ఆభరణాలతో అమ్మవారి వేషధారణలో ముస్తాబైన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ముఖ్యంగా అమ్మవారి రూపంలో చిన్నారులు ప్రదర్శిస్తున్న నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చిన్నారుల రూపంలో అమ్మవారే దర్శనమిస్తున్నారనే భక్తిభావంతో భక్తులు ఈ దృశ్యాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా చిన్నారులకు అమ్మవారి వేషధారణ చేయించడం ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు పరిచయం చేస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అమ్మవారి అలంకరణలో చిన్నారులను చూసి తల్లిదండ్రులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికత కలగలిసిన ఈ వేడుకలు ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపుతూ భక్తులను ఆకర్షిస్తున్నాయి.



టెక్నాలజీతో టెన్షన్.. స్పిరిచ్యువాలిటీతోనే శాంతి: సీఎం చంద్రబాబు

సాంకేతికత (టెక్నాలజీ) మనకు పురోగతిని అందిస్తుండవచ్చు కానీ, దాంతో పాటు తీవ్రమైన ఒత్తిడిని కూడా మోసుకొస్తోందని, ఆ టెన్షన్‌ను జయించడానికి ఏకైక మార్గం ఆధ్యాత్మికతేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం ఎంత ముఖ్యమో, మన సంస్కృతీ సంప్రదాయాలను, వేల ఏళ్ల వారసత్వాన్ని కాపాడుకోవడం కూడా అంతే కీలకమని ఆయన ఉద్ఘాటించారు. విజయవాడలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించిన "విజయవాడ ఉత్సవ్ 2.0" ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "విజయవాడ ఉత్సవాన్ని రెండోసారి దేశం, ప్రపంచం గుర్తుంచుకునేలా నిర్వహించారు. ఇందుకు కారణమైన నిర్వాహకులను, విజయవాడ ప్రజలను పేరుపేరునా అభినందిస్తున్నాను. మీ అందరినీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. విజయవాడ ఉత్సవం 3.0 ప్రపంచమే మనవైపు తిరిగి చూసేలా నిర్వహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ఈ విజయానికి దుర్గమ్మ తల్లి ఆశీస్సులే కారణం" అని అన్నారు.

మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను చాటిచెప్పేలా ఈ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంగీతం, నృత్యం, జానపద కళలు, సాంస్కృతిక ప్రదర్శనలతో దసరా ఉత్సవాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారని కొనియాడారు. ఈ ఉత్సవాలతో పాటు 'సరస్ సదస్సు'ను కూడా ఇక్కడే నిర్వహించడం విజయవాడకు ఒక ప్రత్యేకమైన శోభను తెచ్చిపెట్టిందని ఆయన పేర్కొన్నారు.

టెక్నాలజీ-ఆధ్యాత్మికత సమతుల్యతే కీలకం


తన ప్రసంగంలో టెక్నాలజీ, ఆధ్యాత్మికత ప్రాధాన్యతను చంద్రబాబు ప్రత్యేకంగా వివరించారు. "నేను ఎప్పుడూ టెక్నాలజీ గురించి మాట్లాడతాను. కానీ, టెక్నాలజీ వల్ల టెన్షన్ వస్తుంది. ఆ టెన్షన్ పోవాలంటే ఏకైక మందు స్పిరిచ్యువాలిటీ. ప్రపంచాన్ని జయించే టెక్నాలజీ మనకు సొంతం కావచ్చు, కానీ ఆధ్యాత్మికతతో మన మనసును మనం జయించుకునే అవకాశం లభిస్తుంది. మానసిక ఒత్తిడిని తగ్గించి, మానసిక ఉల్లాసాన్ని పెంచడానికి ఇలాంటి ఉత్సవాలు చాలా అవసరం" అని సీఎం వివరించారు. ఆధునిక జీవితంలో ఉరుకులు పరుగుల మధ్య, గంటల తరబడి సోషల్ మీడియా రీల్స్ చూస్తూ గడుపుతున్న నేటి తరానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

గతానికి, ఇప్పటికీ తేడా ఇదే

గత ప్రభుత్వ హయాంలోని పరిస్థితులను, ప్రస్తుత వాతావరణాన్ని చంద్రబాబు పోల్చిచూపారు. "రెండేళ్ల కిందట రాష్ట్రంలో ఉత్సవాలే లేవు. ఎటుచూసినా భయం, అశాంతి, ఎన్నో ఇబ్బందులు ఉండేవి. కానీ ఈరోజు ప్రజలు స్వేచ్ఛగా, ఆనందంగా పండుగలు చేసుకుంటున్నారు. ఇదే మార్పు," అని ఆయన అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలకు వెళ్లే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఇది తనకు ఎంతో గర్వకారణమని తెలిపారు.

ఆరోగ్యకర, సంపన్న, సంతోషకర సమాజమే లక్ష్యం

ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, యువతకు ఉపాధి కల్పనతో పాటు సుపరిపాలన



ద్వారా ప్రజల పనులను సులభతరం చేస్తోందని చంద్రబాబు తెలిపారు. "పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం ఆశీస్సులు ఇవ్వాలని దుర్గమ్మ తల్లిని కోరాను. ఈ రాష్ట్రంలో ఆరోగ్యకరమైన, సంపన్న, సంతోషకర సమాజం (హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ) ఉండాలన్నదే నా ఆకాంక్ష. అందరూ ఆనందంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా బలంగా ఉండాలి. ఇటీవలే విజయవాడలో కొన్ని వేల మంది సమస్యలను ఒకేసారి పరిష్కరించాం" అని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్ని పుణ్యక్షేత్రాల్లో ఇలాంటి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. మన కళలను, సాంప్రదాయాలను, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ముందుకువచ్చే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విజయవాడ పేరు ప్రపంచంలో మార్మోగే విధంగా ఉత్సవాలను నిర్వహించిన నగరవాసులను "శభాష్ విజయవాడ" అంటూ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం ఎంత ప్రభావం చూపిందంటే, ఇద్దరు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులతో పాటు సాక్షాత్తు దేశ అధ్యక్షురాలు కూడా ఇక్కడికి వచ్చే ఆసక్తి చూపారని, ఇది విజయవాడ స్థల మహత్యమని ఆయన కొనియాడారు.

దమ్ముంటే ప్రజాక్షేత్రంలో గెలవండి: ప్రభుత్వానికి సజ్జల సవాల్

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి హింసకు పాల్పడుతూ, తమ పార్టీపై దుష్ప్రచారం చేస్తోందని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం లేదని, కూటమి నేతలు తమ ఆధిపత్యం కోసం దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. అధికార పక్షమే హింసను ప్రోత్సహించి, ఆ నిందను తిరిగి వైసీపీపై వేసేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులు, కార్యకర్తలను పోలీసులు తీవ్రంగా బెదిరిస్తున్నారని, నిబంధనల ప్రకారం దాఖలు చేసిన నామినేషన్లను సైతం వివిధ సాకులతో తిరస్కరిస్తున్నారని అన్నారు. ఈ బెదిరింపులు, అణచివేత చర్యలతో రాజ్యాంగబద్ధమైన ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి దౌర్జన్యాలు ఆపి, దమ్ముంటే ప్రజాక్షేత్రంలో పోటీ చేసి గెలవాలని అధికార కూటమికి ఆయన సవాల్ విసిరారు. బెదిరింపులకు, చట్టవిరుద్ధమైన చర్యలకు తమ పార్టీ భయపడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఖరిని ప్రజల ముందు ఎండగడతామని, ఈ అప్రజాస్వామిక పద్ధతులకు వెంటనే స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. పలుచోట్ల వైసీపీ అభ్యర్థులపై జరిగిన దాడులు, నామినేషన్ల అడ్డగింతలపై ఇప్పటికే తమ



పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

తెలంగాణ నీటిని కర్ణాటక అక్రమంగా తరలిస్తోంది: శ్రీనివాస్ గౌడ్



తెలంగాణకు కేటాయించిన తుంగభద్ర జలాలను కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా తరలించుకుపోతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాగునీటి అవసరాల పేరుతో మన వాటా నీటిని కర్ణాటక మళ్లిస్తోందని, దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్ర రైతుల ప్రయోజనాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. అక్టోబర్ 10 నుంచి 24 మధ్య కాలంలో సుమారు 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ తుంగభద్ర బోర్డును కోరినట్లు తెలిపారు. బోర్డు షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేసినా, పది రోజులు గడిచినా రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ఆయకట్టుకు నీరు చేరకపోవడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. గతంలో 1,500 క్యూసెక్కులు విడుదల చేస్తే మూడు రోజుల్లోనే ఆర్డీఎస్‌కు చేరేవని, ఇప్పుడు వారం దాటినా రాకపోవడం ఆందోళనకరమని అన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటిని కర్ణాటక తమ ఎగువ ప్రాంతాల్లోనే మళ్లిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై తుంగభద్ర బోర్డు, రాష్ట్ర నీటిపారుదల శాఖ వెంటనే విచారణ జరపాలని కోరారు. ప్రతిరోజూ విడుదలవుతున్న నీటి పరిమాణం, వినియోగం, ఆర్డీఎస్‌కు వాస్తవంగా చేరుతున్న నీటి లెక్కలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష జరిపి, కర్ణాటక ప్రభుత్వంతో చర్చించాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. రైతులకు హామీలు ఇవ్వడమే కానీ, చేతల్లో వారి ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు.

ఎన్నికల బరిలోకి కవిత పార్టీ..

తొలి ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీకాంత్ గౌడ్



తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన పార్టీ తరఫున తొలి ఎన్నికల అభ్యర్థిని ప్రకటించారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను నిలబెడుతున్నట్లు దసరా పండుగ సందర్భంగా ఆమె వెల్లడించారు. కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగడం ఇదే తొలిసారి. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొనలయ్యదేవిపల్లికి చెందిన శ్రీకాంత్ గౌడ్... కాకతీయ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి ఆవిర్భావం నుంచే కవితతో కలిసి పనిచేస్తున్న ఆయన, ప్రస్తుతం పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. గత మూడేళ్లుగా బహుజనుల వాణిని వినిపిస్తున్న తమ అధినేత్రి కవిత... అదే స్ఫూర్తితో పార్టీ నుంచి తొలి అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన శ్రీకాంత్ గౌడ్‌ను ఎంపిక చేశారని పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, ఈ ఎన్నికల కోసం నియోజకవర్గ సమన్వయకర్తగా, పరిశీలకుడిగా సయ్యద్ ఇస్మాయిల్‌ను కవిత నియమించారు.

ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, ప్రభుత్వ సృష్టించిన కరవు: నిరంజన్ రెడ్డి



తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమర్థతే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని పెద్దగూడెం తండాలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పర్యటించిన ఆయన, ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరవని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో నిరంజన్ రెడ్డి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎల్ నినో పేరు చెప్పి ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టాలను వెంటనే అంచనా వేసి, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో 70 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, పాలమూరు, కల్వకుర్తి పంపులను ప్రభుత్వం నడపడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరాపై ప్రభుత్వానికి కనీస అవగాహన లేకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో సుమారు 2.5 కోట్ల మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. నష్టపరిహారం అందేవరకు రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

దసరా వేళ తన సైకిల్‌కు పూజలు చేసిన టీడీపీ ఎంపీ



విజయదశమి పర్వదినం సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన సైకిల్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ గుర్తు కావడంతో పాటు, అది తన తొలి వాహనం కూడా కావడంతో ఈ పూజలకు ప్రాధాన్యత ఏర్పడింది. మంగళవారం విజయనగరం రూరల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పూజల అనంతరం ఆయన తన అర్ధాంగి ప్రభానాయుడుతో కలిసి సైకిల్‌పై సరదాగా విహరించారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ.. తన ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన తన తొలి వాహనం సైకిల్‌కు ప్రతి ఏటా విజయదశమి నాడు ఆనవాయతీగా పూజలు చేస్తుంటానని తెలిపారు. పసుపు వర్ణం శుభానికి, ఆరోగ్యానికి, ఆనందానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ విజయదశమి ప్రజలందరి జీవితాల్లో నూతన ఆశలు, విజయాలు, సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అనంతరం పలువురు టీడీపీ నాయకులు ఎంపీని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలన్నీ సమన్వయంతో పనిచేసి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ కలిశెట్టి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తెలుగు ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.

కాక్రోచ్ జనతా పార్టీ ప్రశ్నలు సరైనవే : అన్నామలై సంచలన వ్యాఖ్యలు



తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, 'వుయ్ ది లీడర్స్' వ్యవస్థాపకుడు అన్నామలై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అడుగుతున్న ప్రశ్నలను తాను సమర్థిస్తున్నానని, అయితే వారి నిరసన విధానాలతో ఏకీభవించనని స్పష్టం చేశారు. చెన్నైలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."సీజేపీ నిరసన తెలిపే విధానాలతో నేను ఏకీభవించకపోవచ్చు. కానీ వారు లేవనెత్తుతున్న ప్రశ్నలకు నా పూర్తి మద్దతు ఉంటుంది. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని అన్నామలై అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసుల వైఖరిపై అన్నామలై మండిపడ్డారు. "నిరసనకారులను అరెస్ట్ చేసి, ఎక్కువ కాలం జైల్లో ఉంచడం వల్ల సీజేపీ నేతలు మరింత బలపడతారు. ఢిల్లీ పోలీసులు ఈ వ్యవహారంలో తప్పుగా ప్రవర్తిస్తున్నారు" అని విమర్శించారు. 'భారతదేశం అన్ని మతాల ప్రజలది. ముస్లింలకు, ఇతరులకు ఇక్కడ స్థానం లేదని ఏ హిందువూ అనకూడదు' అంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను కూడా అన్నామలై స్వాగతించారు.

బయటి రాష్ట్రాల నుంచి రౌడీలను తెచ్చి భయపెడుతున్నారు : మిథున్ రెడ్డి



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ పార్టీల మధ్య రాజకీయ వేడి తారస్థాయికి చేరింది. ఇతర రాష్ట్రాల నుంచి రౌడీలను రప్పించి, వైసీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా టీడీపీ నీచ రాజకీయాలు చేస్తోందని వైసీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. చౌడేపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రజలను భయపెట్టి రాజకీయాలు చేయడం అధికార టీడీపీకి అలవాటుగా మారిందని మిథున్ రెడ్డి విమర్శించారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ధైర్యంగా నామినేషన్లు దాఖలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తల భద్రతకు తాను పూర్తి బాధ్యత వహిస్తానని, కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. తప్పుడు కేసులు బనాయించినా ధైర్యంగా ఎదుర్కోవాలని, తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. అధికారం కోల్పోగానే టీడీపీ నేతలకు అడ్రస్ ఉండదని అన్నారు. ఇటీవల పుంగనూరులో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం సందర్భంగా వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే మిథున్ రెడ్డి టీడీపీపై విరుచుకుపడ్డారు. నామినేషన్ల పర్వం ముగియడంతో తదుపరి ఎన్నికల ప్రక్రియపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన మంగళగిరి వైసీపీ నేతలు



మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తమ కుటుంబాలతో సహా తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న దామర్ల కుబేరస్వామి, ఆయన కుటుంబ సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ వీరికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.టీడీపీలో చేరిన వారిలో మంగళగిరి పట్టణానికి చెందిన సీనియర్ నేత తోలేటి రవీంద్ర, దుగ్గిరాల మండలానికి చెందిన షేక్ అబ్దుల్ సలాం, బిట్రా శేషాంజనేయులు, బిట్రా శ్రీనివాసరావు వంటి ముఖ్య నాయకులు ఉన్నారు. వీరందరితో పాటు మొత్తం 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి ,స్వయంగా మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో వైసీపీకి చెందిన కీలక నేతలు పార్టీ వీడటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఇస్తామని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. అందరం కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని ఈ సందర్భంగా పిలుపు ఇచ్చారు.

నవంబరు 11..

విజయసాయిరెడ్డి కొత్త పార్టీకి ముహూర్తం ఫిక్స్



రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తుండడం తెలిసిందే. ఇవాళ విజయదశమి సందర్భంగా ఆయన తన పార్టీ ఎప్పుడు ప్రకటించేది వెల్లడించారు. నవంబర్ 11వ తేదీన, ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ ఆవిర్భావ కార్యక్రమం ఉంటుందని సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలకడమే తమ ప్రధాన ఎజెండా అని ఈ ప్రకటనలో విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. కుల, మత రాజకీయాలను తిరస్కరించి, 'రెడ్ బుక్-రప్పా రప్పా ఫ్యాక్షన్ల' నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. అమ్మవారి దీవెనలతో, ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా పార్టీని స్థాపిస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా తమ పార్టీ సిద్ధాంతాలను, ప్రజలకు ఇవ్వబోయే హామీలను కూడా విజయసాయి రెడ్డి ఆవిష్కరించారు. కరవు కాటకాలు, కరెంటు కోతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామని, ప్రతి ఎకరాకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ ఉచిత విద్యుత్తు, యువతకు 100 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, పేద, మధ్యతరగతి కుటుంబాల ఆదాయాలు పెంచి, ఖర్చులు తగ్గించడం వంటి కీలక హామీలను ఆయన ముందుంచారు. 80 ఏళ్లుగా నెరవేరని ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, యువత కోసం "జెన్-జీ నాయకుల తయారీ ఫ్యాక్టరీ"గా తమ పార్టీ పనిచేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.విజయసాయి రెడ్డి, ఒకప్పుడు వైసీపీ అధినేత జగన్ కు అత్యంత సన్నిహితుడిగా, పార్టీలో కీలక వ్యూహకర్తగా వ్యవహరించారు. గత ఎన్నికల తర్వాత ఆయన వైసీపీకి రాజీనామా చేశారు. ఏదో ఒక ప్రధాన పార్టీలో చేరతారని భావించినప్పటికీ, సొంతంగా పార్టీ ఏర్పాటు చేయడానికే మొగ్గుచూపారు. ఏపీలో విజయసాయి పార్టీ ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

ఏపీ మున్సిపల్ ఎన్నికలు

: 22,806 నామినేషన్లు ఆమోదం, బరిలో పార్టీల బలాబలాలు



ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 28న జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 22,806 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) అధికారికంగా ప్రకటించింది. వివిధ కారణాలతో 1,531 నామినేషన్లను తిరస్కరించినట్లు అధికారులు వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోని మేయర్లు/ఛైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల పదవులకు ఈ ఎన్నికలు జరగనున్నాయి.వివరాల్లోకి వెళితే, రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్ పదవుల కోసం మొత్తం 286 నామినేషన్లు ఆమోదం పొందాయి. వీటిలో అధికార ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) 46, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 8, బీజేపీ 4 నామినేషన్లు దాఖలు చేశాయి. ఇక వైసీపీ తరఫున 47 మంది, వైఎస్ షర్మిల నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ నుంచి 35 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మరో 93 మంది స్వతంత్రులు కూడా మేయర్ పదవికి పోటీ పడుతున్నారు.రాష్ట్రంలోని 86 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ పదవుల కోసం దాఖలైన 1,027 నామినేషన్లలో 927 సక్రమంగా ఉన్నట్లు తేలింది. వీటిలో టీడీపీ నుంచి 246, జనసేన నుంచి 84, బీజేపీ నుంచి 20 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలోని వైసీపీ నుంచి అత్యధికంగా 277 మంది, కాంగ్రెస్ నుంచి 76 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.ఇక వార్డు సభ్యుల విషయానికి వస్తే, కార్పొరేషన్లలోని 922 వార్డులకు గాను 7,610 నామినేషన్లు ఆమోదం పొందాయి. వీటిలో టీడీపీ నుంచి 2,752, జనసేన నుంచి 972, బీజేపీ నుంచి 332, వైసీపీ నుంచి 2,129, కాంగ్రెస్ నుంచి 194 నామినేషన్లు ఉన్నాయి. అదేవిధంగా, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోని 2,988 వార్డు సభ్యుల పదవుల కోసం ఏకంగా 15,196 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. వీటిలో టీడీపీ 6,032, జనసేన 1,290, బీజేపీ 508, వైసీపీ 5,497, కాంగ్రెస్ 191 నామినేషన్లు దాఖలు చేశాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత తుది అభ్యర్థుల జాబితా వెలువడనుంది.

తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం..

- ప్రజలకు మంత్రి శ్రీధర్ బాబు కీలక సూచనలు



ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు నీరు, విద్యుత్, డబ్బును పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు తలెత్తవచ్చని, ప్రజలు ఇప్పటి నుంచే ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రస్తుతం బోరు బావుల్లో నీటిమట్టాలు పడిపోతున్నాయని, రానున్న రోజుల్లో పరిస్థితి మరింత తీవ్రంగా మారవచ్చని శ్రీధర్ బాబు ఆందోళన వ్యక్తం చేశారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని యాసంగి పంటలను ఎంచుకోవడంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రకృతికి అనుగుణంగా నడుచుకోవాలని హితవు పలికారు. కరువు పరిస్థితులు ఏర్పడితే ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా ఆయన ప్రస్తావించారు. సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉచిత వైద్య సేవలతో పాటు, ఉద్యోగ నోటిఫికేషన్ల ద్వారా ఇప్పటికే సుమారు 70,000 మందికి ఉపాధి కల్పించామని గుర్తుచేశారు.

పంటలు ఎండిపోయాక కమిటీలా?

: కేబినెట్ ఉపసంఘంపై దాసోజు శ్రవణ్



తెలంగాణలో ఎల్‌నినో, కరవు పరిస్థితులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ ఉపసంఘంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది కేవలం కాలయాపన చేయడానికి, బాధ్యత నుంచి తప్పించుకోవడానికి వేసిన ఎత్తుగడ అని ఆయన ఆరోపించారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్న తరుణంలో కమిటీ వేసి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు.ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులకు ఆయన ఓ బహిరంగ లేఖ రాశారు. "ఎల్‌నినో ముప్పు గురించి ఏప్రిల్‌లోనే హెచ్చరికలు వస్తే.. ఆరు నెలల పాటు కుంభకర్ణ నిద్రపోయి, ఇప్పుడు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తే ఏం ఉపయోగం?" అని శ్రవణ్ ఆ లేఖలో ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం ఆరు నెలలుగా ఏమీ చేయకుండా ఉండిపోవడం నేరపూరిత నిర్లక్ష్యమేనని ఆయన దుయ్యబట్టారు.రాష్ట్రంలో కరవు, ఎల్‌నినో పరిస్థితులను పర్యవేక్షించి, నివారణ చర్యలు సిఫార్సు చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా ఆరుగురు మంత్రులతో ప్రభుత్వం సోమవారం నిన్న కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వడం, కేంద్ర సాయం కోరడం వంటి అంశాలను ఈ కమిటీ పరిశీలించనుంది.అయితే, ఏర్పాటు చేసిన కమిటీకి ఎలాంటి కాలపరిమితి విధించకపోవడం, నిధులు కేటాయించకపోవడంపై కూడా శ్రవణ్ అభ్యంతరం తెలిపారు. కరువు సహాయక చర్యల కోసం తక్షణమే అసెంబ్లీ, మండలిని ప్రత్యేకంగా సమావేశపరిచి, రూ.20,000 కోట్ల అనుబంధ బడ్జెట్‌ను ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో ఫేక్ నంబర్ ప్లేట్లపై ఉక్కుపాదం..

100 వాహనాలు సీజ్

- హైదరాబాద్‌లో నకిలీ నంబర్ ప్లేట్లపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

- గత 8 నెలల్లో 100 వాహనాలు స్వాధీనం, క్రిమినల్ కేసులు నమోదు - పట్టుబడిన వాటిలో 88 ద్విచక్ర వాహనాలు, 12 కార్లు

- నకిలీ ప్లేట్లు తీవ్రమైన నేరమన్న జాయింట్ సీపీ జోయల్ డేవిస్ - నిబంధనలు పాటించాలని వాహనదారులకు పోలీసుల విజ్ఞప్తి

హైదరాబాద్ నగరంలో నకిలీ, ట్యాంపర్ చేసిన నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. వాహనాల గుర్తింపును దాచిపెట్టడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేసేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 8 నెలల్లో 100 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 100 క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.నకిలీ నంబర్ ప్లేట్ల వినియోగంపై ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ స్పెషల్ డ్రైవ్‌ను ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 88 ద్విచక్ర వాహనాలు, 12 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, డి. జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ఉపయోగించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. "ఇది ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణ, ప్రజా భద్రతకు పెను సవాలుగా మారుతోంది. ఇటువంటి చర్యల వల్ల వాహనాల అసలు గుర్తింపును దాచిపెట్టడం, నేరాల దర్యాప్తుకు ఆటంకం కలిగించడం, చట్టపరమైన జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడం వంటివి సులభమవుతాయి" అని ఆయన వివరించారు.మోటారు వాహనాల చట్టం-1988, కేంద్ర మోటారు వాహన నిబంధనలు-1989 ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగానే వాహనదారులు నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని ఆయన తేల్చిచెప్పారు. హై-సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (ఎూ్రా) నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అసలు రిజిస్ట్రేషన్ నంబర్‌ను దాచిపెట్టేలా నకిలీ నంబర్లు, అంకెలను మార్చడం, అనుమతి లేని ఫాంట్లు, రకరకాల స్టిక్కర్లు వాడటం వంటివి చట్టవిరుద్ధమని హెచ్చరించారు.



ORIGINAL VEHICLE No.AP09BV5544
(HONDA CITY)



FAKE VEHICLE No.AP09BV5544
(HONDA CITY)
(ACTUAL VEHICLE NO.AP31BP7979)

భవిష్యత్తులో కూడా ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లను కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు చట్టప్రకారం నంబర్ ప్లేట్లను ఉపయోగించాలని, ఎవరైనా అనుమానాస్పద నంబర్ ప్లేట్లతో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.